మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
గురువారం | 17 | ఆగస్టు | 2023 | పేజీలు : 7

## నేటి నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు



చిగురుమామిడి, ఆగస్టు 16 (మనం న్యూస్)ః చిగురుమామిడి మండలం సుందరగిరి కోరమీ సాల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవా ల యంలో గురువారం నుంచి శ్రా వణ మాస ప్రత్యేక పూజలు నిర్వహి ంచనున్నట్లు ఆలయ అర్చకులు శేషం సత్యనారాయణా చార్య, చైర్మన్ గందె సంపత్, రికార్డ్ అసిస్టె ంట్ బూట్ల కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొండపై వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామివారికి అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు కొండపైకి విచ్చేసి ప్రసాదం స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.

# గృహలక్ష్మి దరఖాస్తుల విచారణ

# పారదర్శకంగా ఉండాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 16 (మనం న్యూస్): గృహలక్ష్మి దరఖాస్తులపై విచారణ పారదర్శకంగా చేసి ఇండ్లు లేని, పూరి గుడిసెల్లో ఉండే అత్యంత పేదలను మాత్రమే పథకం అర్హులుగా తేల్చాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి గృహలక్ష్మి పథకం దరఖాస్తుల వెరిఫికేషన్, హరిత హరం ప్లాంటేషన్, మొక్కల సంరక్షణపై అన్ని మండలాల తహశీల్దార్ లు, ఎంపిడివోలు , మున్సిపల్ కమిషనర్ లు, విచారణ బృందాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హుల జాబితా రూపకల్పనలో పాటించాల్సిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 20,375 గహలక్ష్మి' దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. మొదటి విడతలో జిల్లాకు ప్రభుత్వం 6వేల300 ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లో 3 వేల ఇండ్లకు ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చినట్టు తెలిపారు. మహిళ, వితంతువు పేరు మీద మంజూరు అవుతుందని, లబ్ధిదారులు నచ్చిన విధంగా ఇంటిని కట్టుకోవచ్చని వివరించారు.

స్థానికంగా ఉంటేనే అర్హులుగా ఎంపిక చేయాలన్నారు. దరఖాస్తులను గ్రామ, మున్సిపాలిటీ పరిధిలోనీ వార్డుల్లో క్షుణ్ణంగా పరిశీలించేందుకు బృందాలను ఏర్పాటు చేసామని ఆయన చెప్పారు. లబ్దిదారులకు ఆహార భద్రత కార్డ్ ఉండాలని, ఇప్పటికే ఆర్సీసీ రూఫ్ ఇల్లు ఉన్నవారు, జీవో 59 కింద లబ్ధిపొందినవారు, ప్రాసెస్ లో ఉన్న వారు అర్హులు కారని స్పష్టంచేశారు. దళిత బంధు, ఎంబిసి గ్రాంట్ పొందిన వారు మొదటి ప్రాధాన్యత జాబితాలో ఎంపిక చేయవద్దని చెప్పారు. బృందాలు వెంటనే వెరిఫికేషన్ చేపట్టి ఈ నెల 20వ తేదీ నాటికి విచారణ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రక్రియ పారదర్శకంగా, పొరపాట్లకు, మాల్ ప్రాక్టీస్ కు తావు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. జాబితాలో ఏ ఒక్కరైనా తప్పుగా ఎంపిక చేసినట్లు ఆరోపణలు వస్తే బాధ్యుల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహలక్ష్మి పథకం కు అర్హులు గా గుర్తించిన వారికి సంబంధించి ఫోటోగ్రఫీ, జియో కో ఆర్డినేట్స్ తీసుకోవాలని చెప్పారు. అర్హుల జాబితాలోని ఇండ్లు లేని, గుంట కూడా భూమిలేని ,కచ్చా , గుడిసె లో నివసిస్తున్న అత్యంత పేదలను మాత్రమే మొదటి ప్రాధాన్యత కింద మొదటి విడత లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. అర్హుల జాబితాను గ్రామ సభలో ప్రదర్శించాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో సమన్వయం చేస్తారన్నారు. తెలంగాణ కు హరిత హరం కింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి సత్య ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి గంగయ్య, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ గౌతమ్ రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతిలో వాజ్ పేయి క్రియాశీలక పాత్ర

2లో



## మంథని ఎమ్మెల్యే టికెట్ పుట్ట మధుకు ఇవ్వద్దు

- పుట్ట మధుకు తప్ప ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇచ్చినా అధిక మెజారిటీతో గెలిపిస్తాం

- ముత్తారంలో విలేకరుల సమావేశంలో పుట్ట బాధితుల సంఘం డిమాండ్

6లో





## ఫింగర్ ప్రింట్స్ ఎఎస్సైగా ఎంపికైన కిరణ్‌ను అభినందించిన ఎస్పీ

జగిత్యాల ప్రతినిధి, ఆగస్ట్ 16 (మనం న్యూస్): ఫింగర్ ప్రింట్స్ ఎఎస్సైగా ఎంపికైన కానిస్టేబుల్ కిరణ్‌ను ఎస్పీ ఎగ్గడి భాస్కర్ బుధ వారం అభినందించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కిరణ్‌కు పుష్పగుచ్ఛం అందించిన ఎస్పీశుభా కాంక్షలు తెలిపారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో శ్రమించి విజయం సాధించిన కిరణ్‌ను అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ బిసి జనసేన రజక విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా రాజ్ కుమార్



కరీంనగర్, ఆగస్టు 16 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర తెలంగాణ బిసి జనసేన రజక కమ్యూనిటి రాష్ట్ర అధ్యక్షులుగా మావురపు రాజ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు తెలంగాణ బిసి జనసేన రాష్ట్ర అధ్యక్షులు తిప్పా రపు ఆంజనేయులు ప్రకటిం చారు. ఈ మేరకు బుధవారం రాజ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందించారు. బిసిల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ఉద్యమిస్తూ సేవలందిస్తోన్న విషయం గ్రహించి రాజ్‌కుమార్‌ను రజక కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ఆంజనేయులు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అందించిన తిప్పారపు ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. చట్ట సభలో బిసిల రిజర్వేషన్ల సాధనతో పాటు కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖ సాధన కోసం, బిసి కులాల వారిగా జనాభా గణన చేపట్టాలని జరిగే ఉద్యమంలో భాగస్వాములమవుతామని తెలిపారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



సిర్పూర్, ఆగస్టు 16 (మనం న్యూస్): మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల ఉర్దూ మీడియం, ఎంపిపిఎస్ తెలుగు మీడియం పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆలిండియా ఐడల్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌లు, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మండల కో- ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖిజర్ హుస్సేన్, పాఠశాల చైర్మన్ ఇఫ్ఫాత్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు బషీరోద్దీన్, రోజా రాణి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతిలో వాజ్ పేయి క్రియాశీలక పాత్ర

హుజురాబాద్ రూరల్, ఆగస్టు 16 (మనం న్యూస్): దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయీ తన పాలనలో దేశ పురోగతి, అభివృద్ధిపై చెరగని ముద్ర వేసి, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించారని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశం ప్రగతి వైపు పరిగెత్తడానికి, అనేక రంగాలను అభివృద్ధి వైపు తీసుకు వెళ్లడానికి వాజ్ పేయీ ఎంతో కృషి చేశారన్నారు. నిజమైన రాజనీతిజ్ఞుడు, ప్రజాకర్షణ గల వక్త, దార్శనికత కలిగిన నాయకుడన్నారు. దేశం కోసమే పుట్టిన మహానుభావులు ఎందరో ఉన్నారని, దేశమే జీవితం అనుకుని, దేశ హితం కోసం ఆలోచన చేసిన గొప్ప రాజకీయ యోధుడు వాజ్ పేయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, కౌన్సిలర్ పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, నాయకులు తూముల శ్రీనివాస్, దేవేందర్ రావు, మోడెపు వినయ్, గంగిశెట్టి ప్రభాకర్, కొలిపాక శ్రీనివాస్, రావుల వేణు, సబ్బని రమేష్, శశిధర్, పోతుల సంజీవ్, యాళ్ళ సంజీవరెడ్డి, చైతన్య రెడ్డి,



బొరగాల సారయ్య, వొడ్నాల విజయ్, భాస్కర్ యాదవ్, మొలుగూరి నాగరాజు, కేశవ్, రాజు, కొమ్ముల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కుల వృత్తుదారుల లక్ష రూపాయల సహాయంలో గీత కార్మికులను చేర్చాలి

## సర్వే పాపన్న మోకు దెబ్బ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్

కాల్వశ్రీరాంపూర్,ఆగస్టు 16 మనం న్యూస్ : కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిరసన గౌడ్‌లను లక్ష రూపాయల పథకములో చేర్చని పక్షంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ రెండో వారంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతానన్న గౌడ సంఘ నేత ఏగోలపు సదయ్యగౌడ్ పెద్దపల్లి నియోజకవర్గం కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన గౌడ సంఘం నాయకులు ఉన్నతాధికారులు హామీ ఇవ్వాలంటూ కార్యాలయంలో బైఠాయించిన నాయకులు తెలంగాణ ప్రభుత్వం బీసీ కులాలకు చేతివృత్తుల మీద ఆధారపడిన కులాల అభివృద్ధి కోసం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేసే పథకాన్ని పెట్టారు. ఈ కుల వృత్తిపై ఆధారపడిన కులాల జాబితాలో తెలంగాణ లోనే కాకుండా దేశవ్యా ప్తంగా కూడా అత్యంత ప్రమాదకరమైన కల్లు గీసే గీత వృత్తిని కులవృత్తిగా చేసుకుని జీవిస్తున్న కుటుంబాలు గౌడ కుటుంబాలు అని,అట్లాంటి గౌడ కులాన్ని బీసీ కుల వృత్తుల ఆర్థిక సాయం పథకం వర్తించే జాబితాళ చేర్చకపోవడం ఈ కేసీఆర్ ప్రభుత్వం గౌడ్‌ల మీద చూపిస్తున్న సవతితల్లి ప్రేమకు నిదర్శనమని గౌడ సంఘం నేత గోపగోని సారయ్య గౌడ్ మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షులు జాజిరి అంజిగౌడ్‌లు అన్నారు. బుధవారం పెద్దపల్లి నియోజకవర్గం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షులు వేగోలం శంకర్‌గౌడ్,మండల గౌడ సంఘ అధ్యక్షులు గాదార్ల వెంకట్రాజంగౌడ్ నేతృత్వంలో వివిధ గ్రామాల గౌడ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్దెత్తున గౌడ కులస్థులు మోకు ముస్తాదులతో మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయంను ముట్టడించారు. అనంతరం ఎంఆర్‌వో కి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడతాయని తెలంగాణ ఉద్యమంలో గౌడన్నమంతా పెద్ద ఎత్తున ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించామని తీరా రాష్ట్రం వచ్చి ఇన్నేళ్లవుతున్నా గౌడ్‌ల జీవనప్రమాణాలు



ఏమాత్రం మారకపోగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన చెందారు. గత 60 ఏళ్లుగా ప్రభుత్వాలకు కులవృత్తి ద్వారా ప్రత్యక్షంగా పన్నులు చెల్లిస్తూ ప్రభుత్వాన్ని పోషించే ఏకైక సమాజం గౌడ సమాజమేనని,అలాంటి గౌడ వర్గానికి పక్షపాతం తో ప్రభుత్వం నుండి నిరాదరణకు గురికావడం అన్యాయ మన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్ళు తెరచి గౌడలను బీసీలకు కేటాయించే లక్ష రూ.పథకంలో చేర్చాలని లేదంటే గౌడ సమాజం నుండి ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా గోపగోని సార య్యగౌడ్,ఆరెల్లి రమేష్‌గౌడ్,ఒరుగంటి కొమురయ్యగౌడ్,పోశాల సదానందం గౌడ్,ఇల్లందుల రమేష్‌గౌడ్,మెడి తిరుపతిగౌడ్,శ్రీపతి మొగిలయ్యగౌడ్, మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మెడి దేవేందర్‌గౌడ్,రాష్ట్ర యూత్ అధ్యక్షుడు మడ్డి సాయి,కిశోర్‌గౌడ్,జిల్లా యూత్ అధ్యక్షులు వివిధ గ్రామాల గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ

పెద్దపల్లి,ఆగస్టు 16(మనం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయ వాదుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా మంజూరు చేసిన హెల్త్ కార్డులను న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ సలహా మండలి సభ్యులు,సీనియర్ న్యాయవాది పి.వి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దపల్లి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు హెల్త్ కార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల హెల్త్ కార్డులు ప్రతి న్యాయవాదికి 2 లక్షల రూపాయల వైద్య సౌకర్యాల సదుపాయం ఉంటుందని,రాబోయే రోజుల్లో 5 లక్షల రూపాయల వైద్య సదుపాయం కల్పించేందుకు న్యాయవాదుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్,ప్రధాన కార్యదర్శి రెడ్డి శంకర్, ఉపాధ్యక్షులు డివి యస్ మూర్తి,న్యాయవాదులు టి.హనుమాన్ సింగ్,కోరేపు కుమారస్వామి,కే శ్రీనివాస్,జి.మోహన్‌రెడ్డి,దూడం ఆంజనేయు లు, సాముల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఫోటో

# ఓటు ప్రాముఖ్యతపై ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయాలి

### 19న అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5కె రన్

### జాయింట్ ఎన్నికల ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 16 (మనం న్యూస్): ఓటు ప్రాముఖ్యత పై ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయాలని రాష్ట్ర జాయింట్ ఎన్నికల ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణ సమీపిస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నూతన ఓటర్ల సంఖ్య పెరిగే దిశగా అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ సందేశం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళే విధంగా వినూత్న రీతిలో ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటరు టర్న్ ఔట్ పెంచేందుకు అనుసరించే వ్యూహం, చేపట్టే కార్యక్రమాలపై నివేదిక సమర్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల కనుగుణంగా ప్రచారం చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థలో ప్రత్యేక ఎలక్టోరల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని, ఓటరు ప్రాముఖ్యత పై విస్తృత ప్రచారం కల్పించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన ఓటరు నమోదు అంశంలో లింగ నిష్పత్తి 790 మాత్రమే ఉందని, దీని పై ప్రత్యేక శ్రద్ధ వహించి నూతన మహిళా ఓటర్లు నమోదు విస్తృతంగా జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వారిగా ఓటరు జాబితాలో లింగ నిష్పత్తి గమనించి తక్కువ ఉన్న ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులు ముద్రించి అందించాలని అన్నారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన ఓటర్లు, ముద్రించిన ఓటర్ గుర్తింపు కార్డులు, పంపిణీ పై జిల్లా ఎన్నికల అధికారులు



దృష్టి సారించాలని, ఆగస్టు 15 నాటికి మంజూరు చేసిన ఓటర్లు గుర్తింపు కార్డు త్వరగా ముద్రణ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రింటర్లతో సమన్వయం చేసుకొని త్వరగా పంపిణీ చేసేలా చూడాలని అన్నారు. జిల్లాలో మూడవ జెండర్ ఓటరు నమోదు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రెండవ విడత ఓటర్ జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల కంటే ముందు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని, రెండవ ఓటరు సవరణ షెడ్యూల్ పై సమాచారం అందించాలని, ఆగస్టు 21న విడుదల చేస్తామని, సెప్టెంబర్ 19 లోపు అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, మెప్మా పిడి రవీందర్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్టు ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 16 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండరని అందరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కాంట్రాక్టు ఏఎన్ఎం లను వెంటనే రెగ్యులర్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ ముందు ఎఎన్ఎంలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని ప్రకటించారు. అనంతరం వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చి సేవలు చేసిన ఏఎన్ఎంల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా 1520 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయడం సిగ్గుచేటన్నారు. 20 సంవత్సరాలుగా అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రజలకు సేవలు అందిస్తున్న వీరిని కాదని నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా పలు దఫాలుగా తమ సమస్యలు పరిష్కరించాలని రెగ్యులర్ చేయాలని ప్రజా ప్రతినిధులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతులు సమర్పించిన ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వెంటనే కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేసి కాంట్రాక్టు ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రం వస్తే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీ వైస్ ఉద్యోగాలు ఉండవని స్పష్టంగా ప్రకటించిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంల సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏఎన్ఎంలు చేసే ఆందోళన పోరాటాలకు ప్రత్యక్షంగా,పరోక్షంగా సిపిఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



# ఘనంగా వాజ్ పేయి వర్ధంతి

కరీంనగర్, ఆగస్టు 16 (మనం న్యూస్): దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి ఐదవ వర్ధంతి కార్యక్రమాన్ని బిజెపి దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాలరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక 18వ డివిజన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కాల్వ పూర్ణచందర్ రెడ్డి, 39వ బూత్ అధ్యక్షులు దుర్గం ఆంజనేయులు, బిజెపి సీనియర్ నాయకులు ఓల్లాజీ వెంకటస్వామి, ఎం.డి మజీద్ తదితరులు పాల్గొన్నారు.

# మోకాలి మార్పిడిలో రోబోటిక్ సర్జరీలతో మెరుగైన ఫలితాలు

### డాక్టర్ సునీల్ దాచేపల్లి

కరీంనగర్, ఆగస్టు 16 (మనం న్యూస్): ఎలాంటి కత్తిగాట్లు లేకుండా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో వచ్చిన రోబోటిక్ సర్జరీల సక్సెస్ రేటు బాగుందని మోకాలి మార్పిడి చికిత్సకు రోబోటిక్ సర్జరీ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ జాయింట్ రిప్లేస్మెంట్, ఆర్థ్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి తెలిపారు. బుధవారం నగరంలోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థోపెడిక్ సర్జరీల అభ్యున్నతిలో రోబోరిక్ మెకాలి మార్పిడికి శస్త్ర చికిత్స ఉత్తమ పురోగతిగా పరగణించబడుతుందన్నారు. సాధారణ పద్ధతుల్లో చేసే సర్జరీతో పోల్చితే రోబొటిక్ సర్జరీలు చాలా సున్నితంగా ఉన్నాయని పేర్కొన్నారు. కోత లేనందున నామమాత్రపు రక్తస్రావమే ఉంటుందని, నొప్పి కూడా తక్కువని ఇన్ఫెక్షన్స్ దాదాపు ఉండవని వివరించారు. ఇన్ఫెక్షన్స్ లేనప్పుడు రోగికి ఇతర దుష్ప్రభావాలు, అనారోగ్య సమస్యలు రావు అని తెలిపారు. మూడు నెలల్లో వంద రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీలు విజయవంతం చేసినట్లు సునీల్ తెలిపారు. సర్జరీ తరువాత మూడు గంటల్లో నడుస్తారని , మూడు రోజుల్లోనే రోగులు డిశ్చార్జి అయ్యారని తెలిపారు. రోబో సర్జరీలకు విదేశాల్లో కంటే




ఇండియాలో తక్కువ ఖర్చు అవుతుందన్నారు. విదేశీ అనుపత్రులతో పోలిస్తే హైదరాబాద్లో రోబోటిక్ మోకాలి మార్పిడి చేయించుకోవడానికి విదేశీయుల నుండి రోగులు వస్తున్నారని, హైదరాబాద్ మెడికల్ టూరిజంగా మారిందని అన్నారు. ఇండియా వైద్యం పై విదేశీయులకు నమ్మకం పెరిగిందన్నారు. ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ సునీల్ కరీంనగర్లోని యశోద ఆసుపత్రిలో ప్రతి మూడవ మంగళవారం రోగుల కోసం స్క్రీనింగ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వ్యక్తులకు అవసరమైన చికిత్స అందించడం కోసం తన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని మోకాళ్ల నొప్పులకు సర్జరీ అవసరం లేదని తెలిపిన ఆయన, అర్హులకు నొప్పులు మొదటి రెండు దశలను ముందులు, ఇంజెక్షన్లతో నయం చేయవచ్చని చెప్పారు. నాణ్యమైన జీవితాన్ని గడపడానికి సాధారణ పనులను చేయలేనప్పుడు మాత్రమే మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. ఆర్థరైటిస్ నొప్పులను నివారించడానికి ప్రజలు క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలని ఆయన అన్నారు. మోకాళ్ల నొప్పులకు పెయిన్ కిల్లర్స్ వాడవద్దని, అది మూత్రపిండాలపై ప్రభావం చూపుతుందని ప్రజలకు సూచించారు. ఇటీవల సుల్తానాబాద్‌కు చెందిన ఆకుల రాజేశ్వరి (71) అనే మహిళకు వైద్యుడు రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయగా, మోకాళ్ల మార్పిడి తర్వాత ఎలాంటి నొప్పులు లేవని, హాయిగా నడుస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి ప్రాంతాల నుంచి మోకాళ్ల నొప్పులతో ఎక్కువగా వస్తున్నారని తెలిపారు. యశోదలో తన అధ్వర్యంలో మోకాళ్ళ మార్పిడికి రోబోటిక్ స్టోర్ ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

# పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కెసీఆర్ ప్రభుత్వం

### బిజేపి పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

వీణవంక- ఆగష్టు 16(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని భారతీయజనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కష్ణారెడ్డి అన్నారు. బుధవారం బిజేపి రాష్ట్రశాఖ పిలుపు మేరకు మండలంలోని నర్సింగాపూర్,వల్బాపూర్ గ్రామాలలో బిజేపి పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణారెడ్డి ఆధ్వర్యం లో పార్టీ శ్రేణులు వివిధ గ్రామాల్లో పర్యటించి రాష్ట్రప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేస్తున్న పథకాలకు సంబంధించి అర్హులైన ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే సంక్షేమ కార్యక్రమాలకు ప్రధాన ఆధారమైన రేషన్‌కార్డులను అందించకుండ ఇన్నేళ్లుగా ప్రజలనుమోసం చేస్తుందన్నారు. కెసీఆర్ ప్రభుత్వం ప్రకటించే పథకాలకు అర్హతలు కలిగియుండి, కావల్సిన ఆధారాలు సమర్పించినా పథకాలు సక్రమంగా అమలు చేయలేని దుస్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉండడం సిగ్గు చేటు అన్నారు. డబుల్‌బెడ్‌రూంఇండ్లు ,దళిత బంధు, బీసీబంధు, గృహలక్ష్మి లాంటి అనేక పథకాలు ఉన్నాయని అన్నారు. కెసీఆర్ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ప్రజలందరికి న్యాయం జరుగాలనే ఉద్దేశంతో పల్లెబాట/బస్తీబాట కార్యక్రమంతో బిజేపి ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన సంక్షేమపథకాల అర్హులు ,లబ్ధిదారులతో జిల్లాలోని అన్నీ ఎంఆర్వో కార్యా



యాల ఎదుట నేడు బిజేపి పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిం చనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సింహరాజు, నియోజకవర్గ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి, ఐటి సెల్ కన్వీనర్ వినోద్‌కుమార్, కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, నాయకులు రవీందర్, దేవేందర్‌రావు, రాజమల్లుగౌడ్, సంతోష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ సంస్మరణ సభకు రసమయికి ఆహ్వానం



తిమ్మాపూర్, ఆగస్టు 16 (మనం న్యూస్)ః కరీంనగర్ లోని రెవెన్యూ గార్డెన్‌లో ఈ నెల 26న నిర్వహించే ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభకు హాజరు కావాలని కోరుతూ బుధవారం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్‌ను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రసమయిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు రసమయిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.కిషన్ నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రేవెల్లి తిరుపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మీసాల మల్లిక్, బలరాం నాయక్, నాయకులు కనకం సమ్మయ్య, కొడిముంజ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాహెబ్‌హుస్సేన్



వీణవంక- ఆగష్టు16(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని గొప్పలు చెప్పి ఇంతవరకు హుజురాబాద్ నియోజ కవర్గం లోని ఐదు మండలాలలో గల అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించలేదని, సరికొత్తగా గృహలక్ష్మి పథకంతో రాష్ట్రప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సాహెబ్‌హుస్సేన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఉప ఎన్నికల్లో గెలిచిన స్థానిక శాసనసభ్యులు ఈటల రాజేందర్ నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు మంజూరుచేశారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేద లకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇండ్లు అందజే యాలని లేని ఎడల యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను ఆక్రమిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు చదువు జైపాల్‌రెడ్డి, జున్నూతుల మధుకర్‌రెడ్డి, పైడి కుమార్ లు పాల్గొన్నారు.



## ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుంది కేసీఆర్ ప్రభుత్వమే

### హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచిన ప్రభుత్వవిప్ కౌశిక్‌రెడ్డి

వీణవంక-ఆగష్టు16(మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణ ప్రజలు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని అప్పటి ఆంధ్రపాలకులు తెలంగాణను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించారని, రాష్ట్రంలోని సహజవనరులను కొల్లగట్టారని వారి పెత్తనాన్ని నిరసిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కెసీఆర్ తన జీవితాన్నే ఫణంగా పెట్టి దీక్ష చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ముఖ్యమంత్రిగా కెసీఆర్ బాధ్యతలు తీసుకొని రాష్ట్రాన్ని లక్షల కోట్ల రూపాయాలతో అభివృద్ధి చేశారని జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమం,అభివృద్ధిలో దేశంలోనే నెంబర్ వన్ గా తెలంగాణ ను తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం కెసీఆర్ కే దక్కుతుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధికి ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ కు పట్టం కడుతారని అన్నారు. ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులతో హుజురాబాద్ నియోజకవర్గాన్ని అన్నీ విధాల అభివృద్ధి చేస్తున్నారని , ప్రజలకు ఏ సమస్య వచ్చినా కౌశిక్ రెడ్డి వెంటనే పరిష్కరిస్తూ ప్రజల మన్ననలను పొందుతు న్నారని అన్నారు. ప్రజా సేవే ధ్యేయంగా పని చేస్తున్న కౌశిక్ రెడ్డికి ప్రజల ఆదరణ ఎంతో ఉందని , ప్రజల మద్దతుతోనే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డి గెలుపు తధ్యమని అన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తుల విచారణ ప్రక్రియను పరిశీలించిన కమిషనర్



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 16 (మనం న్యూస్): గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన విచారణ ప్రక్రియను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూమి ఉండి, ఇల్లు కట్టుకొనే స్థోమత లేని పేదవారిని గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. వారి ఆర్థిక స్తోమతను పూర్తి స్థాయిలో గుర్తించి, అర్హులకు న్యాయం చేయాలని తెలిపారు.

## మన బస్తి మనబడి పనులను పరిశీలించిన డిఇవో



జగిత్యాల ప్రతినిధి, ఆగస్ట్ 16 (మనం న్యూస్): స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో ఒక కోటి 64 లక్షల రూపాయల వ్యయంతో నిర్మితమవుతున్న మన బస్తి మన బడి పనులను జిల్లా విద్యాధికారి బి.జగన్మోహన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గాంధీ చలనచిత్రం తిలకించిన విద్యార్థులను స్వాతంత్ర ఉద్యమానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామానుజన్, ఉపాధ్యాయులు ఆనంద్ రావు, రజిత తదితరులు పాల్గొన్నారు.

## నూతన విశ్వనాథ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

### ఆలయ ఇవో రవి

మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 16 (మనం న్యూస్)ః మంచిర్యాల విశ్వనాథ ఆలయం నూతన దేవాలయ సముదాయం నిర్మాణానికి కోటి 97 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముక్త రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని శ్రీ విశ్వనాథ స్వామి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ విశ్వనాథస్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాలు, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాలు గత అరవై సంవత్సరాల కిందట నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఆలయాలు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపోతుండటం వల్ల దేవాలయాలు పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ సర్వే నిర్వహించి సర్వశ్రేయో నిధి నుండి కోటి 97 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వీటి ద్వారా పునర్నిర్మాణ కార్యక్రమం కోసం త్వరలో టెండరు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ సముదాయ పనుల పునర్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కృషితో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గాలికి వదిలేసి..

# గృహలక్ష్మి పేరిట మోసం చేస్తున్నారు

### నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సజ్జద్ అహ్మద్

జమ్మికుంట, ఆగస్టు 16 (మనం న్యూస్): డబల్ బెడ్ రూమ్ ఇళ్లు గాలికి వదిలేసి గృహలక్ష్మి పథకం పేరుతో మళ్ళీ పేద ప్రజలను మోసం చేయాలని ప్రభుత్వం చూస్తుందని హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సజ్జద్ అహ్మద్ ఆరోపించారు. జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే మాయమాటలు చెప్పి మభ్యపెట్టి భ్రమలో ఉంచి ప్రజలను మోసం చేయడమేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హుజురాబాద్ నియోజకవర్గంలో గత ఉప ఎన్నికల్లో గెలిచినప్పటి నుండి స్థానిక ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నుండి హుజురాబాద్ నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లకు కేంద్రం నిధులు ఎన్ని ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేక అల్లాడుతున్న నిరుపేద ప్రజలతో కలిసి నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆక్రమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు పోడెటి బిక్షపతి , చిట్యాల శంకర్ , ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సూర్య , హరీష్ రెడ్డి , శ్రీనివాస్ , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## హోంగార్డ్‌కు ఆర్థిక సహాయం చేసిన ట్రాఫిక్ ఏసిపి




గోదావరిఖని, ఆగస్టు 16 (మనం న్యూస్): రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ కుమారుని వైద్యం కోసం రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌లు బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హోంగార్డ్ సంజీవ్ అనారోగ్యంతో ఉన్న తన కుమారునికి వైద్య చేయించుకోలేని దీన స్థితిలో ఉన్నాడని తెలుసుకున్న సిఐ ప్రవీణ్ కుమార్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో 13వేల ఒక వంద రూపాయలు జమ చేసి ట్రాఫిక్ ఎసిపి నరసింహులు చేతుల మీదుగా అందించారు. అనంతరం ఎసిపి మాట్లాడుతూ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వారు కష్టాల్లో ఉన్నది చూసి వారికి సహాయం చేయడంతో పాటు స్టేషన్లో పనిచేసే సిబ్బందిని సహా యంలో భాగస్వామ్యం చేయడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. సీఐ ప్రవీణ్ కుమార్ తో పాటు హోంగార్డ్ కు సహాయం చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై ఉదయ్ కిరణ్, ఎఎస్సైలు వెంకటేశ్వర్లు, మల్లేశం,హెడ్ కానిస్టేబుల్ బాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కిరోసిన్ పోసుకొని మహిళ ఆత్మహత్యాయత్నం



జమ్మికుంట, ఆగస్టు 16 (మనం న్యూస్): పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కందుకూరి రమాదేవి అనే వివాహిత బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాల వల్ల ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ శ్రీపతి నరేష్ హుటాహుటిన ఆమెను రక్షించి అంబులెన్స్ ద్వారా హుజరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. దాదాపు 40 శాతం పైగా శరీరం కాలడంతో హుజురాబాద్‌లో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ కి తరలించారు. కాలిన గాయాలతో ఉన్న బాధితురాల్ని కాపాడడానికి చాలామంది భయపడగా, మానవత్వంతో నరేష్ ఆమెను అంబులెన్స్ ఎక్కించి ఆమెతోపాటు హుజరాబాద్ హాస్పిటల్ కి వెళ్లడంతో స్థానికులు నరేష్‌ను ప్రశంసించారు.

## పత్తి కాండానికి బొట్టుపెట్టే విధానంపై అవగాహన



ఇల్లందకుంట, ఆగస్టు 16 (మనం న్యూస్): మండలంలోని గడ్డివానిపల్లి గ్రామంలోని రైతు క్షేత్రంలో పత్తి పంటలో కాండానికి బొట్టు పెట్టే విధానం గురించి బిసిఐ ఫీల్డ్ ఆఫీసర్ రావుల రాకేష్ బుధవారం రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండానికి బొట్టు పెట్టడం వలన పత్తి పంటల్లో మిత్ర పురుగులు పెరుగుతాయని చెప్పారు. దీంతో రైతులకు పెట్టుబడి తగ్గుతుందని పత్తి పంటలో వచ్చే రసం పీల్చే పురుగును 60 రోజుల వయసు వరకు నివారించవచ్చని తెలిపారు. రైతులు అధిక రసాయనాలు స్ప్రే చేయడం వలన వాతావరణ కాలుష్యం, భూమి కాలుష్యం, నీటి కాలుష్యంతో పాటు రైతుకు పెట్టుబడి పెరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గడ్డి శ్రీనివాస్, చింతల మహేష్, సునీల్, సతీష్, చెవుల ఓదెలు, రైతులు పాల్గొన్నారు.

## 'మనం' కథనానికి స్పందన

### మట్టి తరలించే వాహనాన్ని సీజ్ చేసిన తహసిల్దార్




సుల్తానాబాద్,ఆగస్టు 16 (మనం న్యూస్): 'అక్రమంగా మట్టి తరలింపు' అనే శీర్షికతో 'మనం' ప్రచురించిన కథనానికి అధికారుల నుంచి స్పందన వచ్చింది. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల సమీపంలోని నీలగిరి చెట్ల వనాల మధ్యలో ఎలాంటి అనుమతులు లేకుండా కోట్లాది రూపాయల మట్టిని తరలిస్తున్నారని మనం దినపత్రికలో ఈ నెల 13న కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి ఎట్టకేలకు స్పందించిన సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూధనరెడ్డి బుధవారం నీరుకుల్ల గ్రామానికి చేరుకొని మట్టి దందాపై గ్రామస్తులను విచారించా రు. ఈ సందర్భంగా మట్టిని తరలిస్తున్నట్లు తేలిన టిఎస్02 యుబి 8914 నంబరు గల టిప్పర్‌ను సీజ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా మట్టి తరలిస్తూ పట్టుబడితే ఎంతటి వారికైన శిక్ష తప్పదని,వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వాణి, రెవెన్యూ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.


అక్రమంగా మట్టి తరలింపు
మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడేనా..?
గత కొద్ది రోజులుగా జోరుగా మట్టి రవాణా




# ఏజెన్సీలు, ట్రావెల్స్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

### 101 పాస్‌పోర్టులు, 300 డాక్యుమెంట్లు స్వాధీనం

జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 16 (మనం న్యూస్): జిల్లా వ్యాప్తంగా 15 ట్రావెల్స్, 36 ఏజెన్సీలపై పోలీసులు బుధవారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ట్రావెల్స్ ఏజెన్సీలో ఉన్న 101 పాస్‌పోర్టులను సీజ్ చేసిన అధికారులు, 300 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ విదేశాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసే ఏజెన్సీలు, ట్రావెల్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత ట్రావెల్స్, ఏజెన్సీలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే వారు నకిలి ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నకిలి ఏజెంట్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ గుర్తింపు వున్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలని సూచించారు. నిరుద్యోగ యువతీ, యువకులు విదేశాల్లో ఉద్యోగావకాశం కోసం ప్రయత్నించే ముందు సంబంధిత ఏజెంట్లకు అనుమతి ఉన్నదీ లేనిదన్న విషయం తెలుసుకోవాలని ఎస్పీ సూచించారు. నిబంధనలను అతిక్రమించి అభ్యర్థులను మోసం చేసే ఏజెన్సీల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్పీ హెచ్చరించారు.





## ఓడేడు లో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



ముత్తారం,ఆగస్టు 16 మనం న్యూస్ ః ముత్తారం మండలం లోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్లు పల్లెలో భుక్య తిరుపతి 26 పురుగుల మంతు తాగి ఆత్మహత్య చేసుకు న్నారు. కుటుంబ సభ్యులు ముత్తారం ఎస్సై మధుసూదన్ రావు తెలిపిన వివరాల ప్రకారం రెండు సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకోవడం కోసం చేసిన అప్పు వడ్డీలతో సహా పెరిగిపోవడంతో అప్పు ఎలా తీర్చాలి అని బాధ పడుతుండేవాడని రోజు లాగానే 14వ తారీకు సోమవారం రోజున రాత్రి 8 గంటల సుమారులో బయటికి వెళ్లి వస్తా అని చెప్పి ఏదో పురుగుల మందు తాగి వచ్చి నేను మందు తాగిన అని చెప్పడంతో పక్కవారి సహాయంతో ముత్తారంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపోగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ నిర్ధారించారు నా భర్త చావుపై ఎలాంటి అనుమానం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్సై మధూసూదన్‌రావు తెలిపారు. మృతునికి రెండు సంవత్సరాల పాప ఉంది.

## నాబార్డు సహకారంతో మహిళా సాధికారత



**కొండ్రా రాజలింగం**

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 16 (మనం న్యూస్): నాబార్డ్ సహకారంతోనే మహిళా సాధికారత చెందుతుందని ఐడియల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొండ్రా రాజలింగం అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాబార్డ్ సంస్థ ద్వారా ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై శిక్షణ పొందిన 45 మంది స్వశక్తి సంఘం మహిళలు టెక్స్ టైల్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారు టెక్స్ టైల్ పార్కులో వస్త్ర ఉత్పత్తి కేంద్రాన్ని,కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని, బతుకమ్మ చీరల తయారీ నీ సందర్శించారు. నాబార్డ్ సంస్థ ద్వారా గంభీరావుపేట మండలంలోని గజ సింగవరం కొత్తపల్లి గ్రామాల్లో శిక్షణ పొందిన మహిళలకు అపెరల్ పార్క్ లో ఉపాధి కల్పించాలని టెక్స్ టైల్ పార్క్ అధ్యక్షుడు అనిల్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి, అవసరమైన 10 రోజుల ప్రత్యేక శిక్షణను టెక్స్ టైల్ పార్క్ లో అందించి, తప్పకుండా అపెరల్ పార్క్ లో ఉపాధి పని ఎందుకు కృషి చేస్తానని బాల సాయి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్స్ టైల్ పార్క్ యొక్క రీసెర్చ్ పర్సన్ లు స్వశక్తి సంఘం మహిళలు పాల్గొన్నారు.

## తాగునీరు సరఫరా పునరుద్ధరణకు తాత్కాలిక ఏర్పాట్లు



కొత్తపల్లి, ఆగస్టు 16 (మనం న్యూస్)ః గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఫిల్టర్ బెడ్ నుంచి వాటర్ ట్యాంకులకు వచ్చే పైప్ లైన్ పూర్తిగా ధ్వంసం కావడంతో పైపుల పరమత్తులు పూర్తయ్యేంతవరకు తాగు నీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు ఆధ్వ ర్యంలో బుధవారం తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా చీకటి గుడి వద్ద పైపు లైన్లకు తాత్కాలికంగా మరమతులు చేసి తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కమిషనర్, పాలకవర్గంతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రుద్ర రాజు మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులు పూర్తయ్యే వరకు పరిసర ప్రాంత వాడలకు నీరు అందించడానికి ఫిట్టర్ శంకర్, సిబ్బం దితో తాత్కాలికంగా నీరు అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# మంథని ఎమ్మెల్యే టికెట్ పుట్ట మధుకు ఇవ్వద్దు

ముత్తారం,ఆగస్టు 16 మనం న్యూస్ ః రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యే టికెట్ పుట్ట మధుకు ఇవ్వద్దని ఇస్తే అతనికి డిపాజిట్ కూడా రాదని పుట్ట మధు బాధితుల సంఘం ఆధ్వర్యంలో ముత్తారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ పుట్ట మధుకు తప్ప ఎవరికి ఇచ్చిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా మంథనిలో అధిక మెజార్టితో గెలిపిస్తామని వారు అధిష్టానానికి తెలిపారు. పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రస్తుత జెడ్పి చైర్మన్‌గా మంథని నియోజకవర్గంలో పుట్ట మధు అరాచకాలు అంతా ఇంతా కాదని నియంత పోకడతో కార్యకర్తలు నాయకులను అవమానపరుస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత పుట్ట మధు బిఆర్ఎస్ పార్టీలోకి వచ్చాడని ఆ తరువాత తయన తన సొంత ఎజెండా మంథని నియోజకవర్గంలో అమలుపరుస్తూ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు నాయకులను పక్కన పెడుతూ అవమానాలు చేస్తున్నారని అన్నారు. ఇందుకు ఉదాహరణగా రామగిరి ఎంపీపీ ఆరెల్లి దెవక్క కొమురయ్య,మహాదేవపూర్ ఎంపీపీ రాణిబాయి రామారావు,ముత్తారం మండలంలోని మాజీ జడ్పిటిసి నాగినేని జగన్మోహన్‌రావు,మైదం భారతి వరప్రసాద్ ఇలా చెప్పుకుంటూ పోతే మండల స్థాయి ప్రజాప్రతినిధులు ,సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపసర్పంచ్‌లు ,వార్డు సభ్యులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎంతోమంది మనోవేదనకు గురవుతున్నారని వారి బాధను అర్థం చేసుకొని బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం మధుకు టికెట్ ఇవ్వకుండా మరెవరికైనా ఇవ్వాలని వారు కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ పుట్ట మధు బాధితుల సంఘం నాయకులు



నాగినేని జగన్మోహన్‌రావు,రామగిరి ఎంపిపి ఆరెల్లి దేవక్క కొమురయ్య, మైదం వరప్రసాద్,కాటారం మాజీ జెడ్పిటిసి దుర్గం మల్లయ్య,కాటారం మాజీ మండల పార్టీ ప్రెసిడెంట్ బండం వసంత్‌రెడ్డి,గ్రంథాలయ డైరెక్టర్ గుడిసె గట్టయ్య,బొల్లినేని బుచ్చం రావు,అలగం రాజేశం,సిరిమల్ల తిరుమలరావు, ఓడేడు సర్పంచ్ బక్కారావు,ఖమ్మంపల్లి మాజీ ఎంపిటిసి బండారి సుధాకర్,ఖమ్మంపల్లి సర్పంచ్ సముద్రాల రమేష్,నియోజకవర్గంలోని 18 మంది సర్పంచులు,ఏడుగురు ఎంపిటిసి,ముగ్గురు మాజీ ఎంపిటిపిలతో పాటు 200 మంది నాయకులు,సర్పంచులు,ఎంపిటిసిలు,టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెలిచాల ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ప్రభుత్వానికి లేఖ



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 16 (మనం న్యూస్)ః రామడుగు మండలం వెలిచాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 682, 683లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వం తిరిగి అసైన్డ్, ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకుని ఇళ్లు లేని నిరుపేదలకు గృహ లక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని కే వి పి ఎస్ జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రాష్ట ప్రభుత్వానికి పంపిన లేఖను జిల్లా కార్యాలయం లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అధికార పార్టీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి అమ్ముతున్నా జిల్లా అధికారులు పట్టనట్లుగా వ్యవహారిస్తున్నారన్నారు. అనేక సార్లు వెలిచాల గ్రామంలోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముతున్నారని తహశీల్దార్ జిల్లా కలెక్టర్ పిర్యాదులు చేసిన పట్టనట్లు గా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీటికి గ్రామ పంచాయతీ అధికారుల వద్ద అధికారపార్టీ నేతల అండదండలతో ఇంటి అనుమతులు మంజూరు పొందుతున్నారని, తక్షణమే రెవెన్యూ అధికారులు అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కబ్జా దారుల నుండి కాపాడాలని కోరారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకుని ఇల్లు లేని నిరుపేదలకు గృహ లక్ష్మి పథకం కింద పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కె సాగర్, నగర కార్యదర్శి గాజుల కనకరాజు, నగర అధ్యక్షుడు సాయి కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కనకేష్ లు పాల్గొన్నారు .



# ప్రజలకు అండ కాంగ్రెస్ పార్టీ

### చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్

మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 16 (మనం న్యూస్)ః ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని, ప్రజల హక్కుల రక్షణకు కట్టుబడి పాలన సాగించే ఎకైక పార్టీ కాంగ్రెస్ అని చెన్నూరు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ అన్నారు. బుధవారం నియోజకవర్గం లోని చెన్నూరు మండలం భీరెల్లి గ్రామంలో ఊరుఊర కి కాంగ్రెస్ పార్టీ ఎజెండా కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలోని ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు కట్టుబడి, ప్రతి వాగ్దానాలను అమలు చేస్తూ పాలన సాగించే దిశగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తుందని, ప్రజల కష్టాలను గుర్తించి వాటి పరిష్కార దిశగా పథకాలను అమలు చేసే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని తెలిపారు. మాయ మాటలతో రెండు సార్లు రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఎ ఒక్క హామీని కూడ అమలు చేయలేదని, ప్రజలను మోసం చేసేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు పథకాలు, తప్పుడు ప్రచారాలతో ముందుకు వెళ్ళాలని చూస్తుందని, బిఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. స్థానికేతరుడైన బాల్క సుమన న్ను నమ్మి ఎమ్మెల్యే చేస్తే ఈ ప్రాంత సంపద దోచుకెళ్లి హైదరబాద్ లో జల్సాలు చేస్తున్నాడని, స్థానిక ప్రజలను, రైతులను, యువకులను, విద్యార్థులను మోసం చేసి మోహం చూపించలేక బాల్క సుమన్ నియోజకవర్గంకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చే విధంగా ఆశీర్వదించి ఓటు వేయాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే విధంగా దీవేనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకయ్య గౌడ్, మంతెన సమ్మయ, శంకర్ గౌడ్, పగిడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సిఐఆర్‌తో పొగొట్టుకున్న ఫోన్‌ల జాడ కనిపెట్టవచ్చు

## : రూరల్ సిఐ కృష్ణ కుమార్




వేములవాడ టౌన్, ఆగస్ట్ 16 (మనం న్యూస్): సిఇఐఆర్ టెక్నాలజీతో పోయిన ఫోన్ తిరిగి పొందవచ్చని వేములవాడ రూరల్ సిఐ వై.కృష్ణ కుమార్ తెలిపారు. వట్టెంల గ్రామంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ సాంకేతికతతో కనుగొని, బాధిత వ్యక్తికి వేములవాడ రూరల్ పోలీసులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ మాట్లాడుతూ వట్టెంల గ్రామానికి చెందిన మహేష్ తన మోటార్ సైకిల్ పై వెళుతుండగా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకొని, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ అనే వెబసైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్ ను ఎంటర్ చేసి, బ్లాక్ చేయటం జరిగిందన్నారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో సీఈఐఆర్ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం లబించినట్లు తెలిపారు. అనంతరం ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి అందించినట్లు తెలిపారు. ఫోన్ అప్పగించడంలో కృషి చేసిన టెక్ టీమ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను సిఐ కృష్ణ కుమార్, ఎస్ఐ మారుతి అభినందించారు.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

మంచిర్యాల జిల్లా: మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజీపూర్, లక్షెటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట,

ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన. వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.

మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

నిర్మల్ జిల్లా: నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

ఆదిలాబాద్ జిల్లా: అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076